# నమస్తే తెలంగాణ

## జోగులాంబ గద్వాల వనపర్తి

5 | మహబూబ్‌నగర్, మంగళవారం 20 ఆగస్టు 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY


# జోరు వాన


జలమయమైన అయిజ కాళమ్మపేట కాలనీ


బిజినేపల్లిలో..


అయిజలో కుంటను తలపిస్తున్న గాజులపేట కాలనీ

- పలు చోట్ల దంచికొట్టిన వర్షం
- జలమయమైన డ్రైనేజీలు, కాలనీలు

అలంపూర్/అయిజ/గట్టు/మల్దకల్/ఉండవెల్లి, ఆగస్టు 19 : ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పలు చోట్ల వర్షం దంచికొట్టింది. సోమవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఉరుములు, మెరుపులతో ఏకధాటిగా మోస్తరుతోపాటు భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పారాయి. డ్రైనేజీలు పొంగిపొరడంతో కాలనీలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపై పెద్ద ఎత్తున వర్షపు నీరు నిలిచింది. ఫలితంగా పలు చోట్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అయిజ పట్టణంలోని పలు కాలనీలు నిండిపోయాయి. పెద్దవాగు సమీపంలోని ప్రధాన రోడ్డుపై రాకపోకలకు అంతరాయం కలిగింది. మడ్డిగుంత, ఒల్లూరుపేట, కాళమ్మపేట, రంగుపేట, భరత్‌నగర్, బుడగ జంగాల కాలనీతోపాటు పలు ప్రాంతాలు చిన్నపాటి కుంటను తలపించాయి. వారం రోజులుగా ఉక్కబోతతో తల్లడిల్లిన జనం ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో సేదతీరుతున్నారు. వర్షం రాకతో పంటలకు ప్రాణం రాగా.. రైతులు హర్షం వ్యక్తం చేశారు.

### పిడుగుపాటుతో ముగ్గురు మృతి

వర్షం కురిసిన సమయంలో పిడుగుపాటుకు గురై ముగ్గురు మృతి చెందారు. అలంపూర్ మండలం క్యాతూరు గ్రామానికి చెందిన రైతు వేముల రాజు (35) పొలానికి నీళ్లు పారించేందుకు వెళ్లాడు. అకస్మాత్తుగా వర్షం కురవడంతో సమీపంలోని ఈదమ్మ గుడి వద్ద ఉన్న చెట్టుకిందకు వెళ్లగా పిడుగు పడి మరణించాడు. అతడికి భార్యతోపాటు ఇద్దరు ఆడ పిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. ఏపీలోని నందవరం మండలం కనకవీడు గ్రామానికి చెందిన వడ్డె వీరశేఖర్ తన కుటుంబంతో 15 రోజుల కిందట మల్దకల్ మండల కేంద్రానికి వచ్చాడు. సీడు పత్తి పనులు చేస్తుండగా.. ఉరుములు, మెరుపులు రావడంతో వీరశేఖర్ కూతురు ఆదిలక్ష్మి(15) మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గద్వాల దవాఖానకు మృతదేహాన్ని పంపించినట్లు ఏఎస్సై తెలిపారు. అలాగే గట్టు మండలం ఆరగిద్ద శివారులో తలారి నల్లారెడ్డి(30) సీడ్ పత్తి పైరుకు నీరు పారిస్తుండగా పిడుగుపడి అక్కడికక్కడే మృతిచెందాడు. అతడికి సమీపంలో ఉన్న కుటుంబ సభ్యులు తృటితో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే పక్క పొలంలో ఉన్న భీమేశ్, అతడి భార్య రాజేశ్వరి, తల్లి లక్ష్మితో పాటు తల్లీకుమారులు లోకమ్మ, వీరేశ్ పిడుగుపాటుతో అపస్మారక స్థితికి చేరుకున్నారు. వీరిని వెంటనే కర్నూల్ దవాఖానకు తరలించారు. ఉండవెల్లి మండలం కంచుపాడుకు చెందిన సిద్దన్న కుమారుడు ఖాజా మియా, కోడలు షాలిబీ వారి మిరప పంటలో పనికి వెళ్లారు. మధ్యాహ్న సమయంలో భోజనం చేసి ఎడ్లతోపాటు చెట్టు కింద విశ్రాంతి తీసుకున్న సమయంలో వర్షం మొదలై మెరుపులతో పిడుగు పడగా ఒక ఎద్దు మృతి చెందింది. ఖాజా మియా, షాలిబీ స్పృహ తప్పి పడిపోయారు. వీరిని కర్నూల్ దవాఖానకు తరలించారు. మృతి చెందిన ఎద్దు విలువ రూ.70 వేల వరకు ఉంటుంది.

- మూడో విడుతలోనూ సాంకేతిక కొర్రీలు
- కందనూలు జిల్లాలో మొత్తం రైతులు 1,47,500 మంది
- మాఫీ అయ్యింది 1.02లక్షల మందికే..
- మిగతా వారికి ఎదురు చూపులేనా..?

మాఫీ.. మాఫీ అంటూ రైతుల రుణమాఫీపై ప్రభుత్వం ఓవైపు పెద్ద ఎత్తున ఊరించేలా ప్రకటనలు చేస్తోంది. కానీ గ్రామాల్లో ఎవరికి మాఫీ అయ్యిందో అంతు చిక్కని పరిస్థితి నెలకొన్నది. లెక్కల్లో మాఫీని చూపిస్తుంటే గ్రామాల్లో ఎంత మందికి మాఫీ జరిగిందో తెలియడం లేదు. అధికారుల నివేదిక ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లాలో 1.47లక్షల మంది రుణమాఫీకి అర్హులుగా పేర్కొంటుండగా ఇప్పటి వరకు మూడు విడుతల్లో 1.02 లక్షల మందికి మాఫీ జరిగింది. ఇంకా 40 వేలమందికిపైగా రైతులకు మాఫీ ఎండమావిగానే మిగిలిపోయిందా అనే సందేహాలు నెలకొన్నాయి.

– నాగర్‌కర్నూల్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ)

# మాఫీ ఎండమావే..?



### మూడో.. సారీ.. మాఫీనే..

రైతురుణమాఫీ పథకంలో సాంకేతిక సమస్యలు రైతులకు ఆందోళన కలిగిస్తున్నాయి. మూడు విడుతల్లో రుణమాఫీ చేస్తున్నట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. గతనెల 18వ తేదీ నుంచి రూ.లక్షలోపు రుణాలున్న రైతులకు తొలి విడుత, 30వ తేదీన రూ.1.50లక్షలున్న రైతులకు రెండో విడుత మాఫీ చేసింది. తాజాగా రూ.2లక్షల రుణమాఫీని ఈనెల 15నుంచి ప్రారంభించింది. అయితే ఈ మాఫీ ఎవరికి జరిగిందో, ఎవరికి జరగలేదో తెలియని పరిస్థితులు క్షేత్రస్థాయిలో ఉన్నాయి. అధికారులు వెల్లడించిన జాబితాలో మాఫీ అయిన రైతుల పేర్లను మాత్రమే ఉన్నాయి. అయితే రుణాలు తీసుకున్న వేలాది మంది రైతులకు జాబితాలో తమ పేర్లు రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. తొలి విడుత నుంచి ఇదే సమస్య పునరావృతమవుతున్నది. బ్యాంకుల వారీగా మాఫీ అయిన రైతుల వివరాలను అంకెల రూపంలో బయటికి వెల్లడిస్తున్న అధికారులు గ్రామాల వారీగా పారదర్శకంగా మాత్రం వెలువరించడం లేదు. తమ పేరు ఎందుకు రాలేదోనని అడిగే రైతులకు ఇప్పటికీ వ్యవసాయ అధికారుల నుంచి స్పష్టమైన సమాధానం లేదు. ఆధార్ అప్‌డేట్, కుటుంబ సమస్యలు, బ్యాంక్ ఖాతాల్లాంటి మూడు రకాల సమస్యలతో చాలామంది రైతులకు రుణ మాఫీ అందనట్లుగా తెలుస్తోంది. ఇలాంటి రైతుల సమస్యల పరిష్కారానికి ఏఈవో, ఏవో కార్యాలయాల ద్వారా అధికారులు ఫిర్యాదులు స్వీకరించారు. కానీ ఇప్పటి వరకూ ఎలాంటి పరిష్కారం లభించలేదు. నాగర్‌కర్నూల్‌లో ఇలా 1500మంది వరకు రైతులు ఫిర్యాదు చేయగా ఆన్‌లైన్‌లో అధికారులు ఈ సమస్యలను ప్రభుత్వానికి నివేదించారు. గత రెండు విడుతల మాదిరిగానే తాజాగా మూడో విడుతలోనూ అలాంటి పరిస్థితులే ఎదురయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో దాదాపుగా 1,47,500మంది రుణమాఫీకి అర్హులు కాగా ఈ మూడు విడుతల్లో 1.02లక్షల మంది రుణమాఫీ అయ్యింది. మిగిలిన 40వేల మంది రైతులకు మాఫీ ప్రశ్నార్థకంగానే మిగిలింది. ఇలా జిల్లాలో దాదాపుగా పెండింగ్‌లో ఉన్న రైతులకు రూ.111కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుంది. చాలామంది రైతులకు మాఫీ జరిగినట్లుగా పేర్కొంటున్నా బ్యాంకు ఖాతాలో జమ కానట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం వరుస సెలవులు రావడంతో రైతులు బ్యాంకులకు వెళ్లి చూసుకుంటేనే డబ్బులు జమ కావడంపై స్పష్టత వచ్చే అవకాశముంది.

| బ్యాంకు | రైతులు | రుణమాఫీ(కోట్లల్లో) |
|---|---|---|
| ఏపీజీవీబీ | 36,598 | 303.19 |
| బరోడా | 2,374 | 23.34 |
| కెనరా | 564 | 4.15 |
| డీసీసీబీ | 15,139 | 95.49 |
| హెచ్‌డీఎఫ్‌సీ | 1 | 0.01 |
| ఐసీఐసీఐ | 45 | 0.63 |
| ఇండియన్ ఓవర్సీస్ | 2,361 | 13.61 |
| కృష్ణ భీమా సమృద్ధి | 29 | 0.22 |
| పంజాబ్ నేషనల్ | 1,860 | 13.45 |
| ఎస్‌బీఐ | 26,339 | 248.27 |
| తెలంగాణ గ్రామీణం | 17 | 0.10 |
| యూబీవోఐ | 15,282 | 136.01 |
| యూసీవో | 1,858 | 15.83 |
| మొత్తం | 1,02,467 | 854.28 |

## ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి



ఎకకాలంలో రైతులకు రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేశామని ప్రభుత్వం చెబుతున్నా చాలా మంది రైతులకు రుణమాఫీ అమలు కాలేదు. నేను యూనియన్ బ్యాంక్‌లో రూ.లక్షా 60వేలు లోన్ తీసుకొని డిసెంబర్‌లో రెన్యూవల్ చేసుకున్నా.. అలాగే నా భార్య పేరు మీద రూ.యాభై వేలు క్రాప్‌లోన్ తీసుకున్నా ఇంత వరకు ప్రభుత్వం ప్రకటించిన మూడు విడుతల్లో మా ఇద్దరిలో ఒకరికి కూడా రుణ మాఫీ కాలేదు. రుణమాఫీ ఎందుకాలేదని అడిగితే రేషన్‌కార్డులో ఇద్దరు ఉండడం వల్ల సాంక్షేత కారణాలు అయ్యిండొచ్చని అధికారులు చెబుతున్నారు. రుణ మాఫీ విషయంలో ప్రభుత్వం ఇంటికి ఒకరికే రుణమాఫీ ఇస్తుందా లేదా అర్హులందరికీ అమలు చేస్తుందా అనేది స్పష్టమైన ప్రకటన చేయాలి.

– ఎం రాజేశ్వర్‌రెడ్డి, రైతు, అమరచింత, వనపర్తి జిల్లా

## పండుగ పబ్బం లేకుండా తిరుగుతున్నాం



ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామంటే పట్టలేని సంతోషం అనిపించింది. కానీ ఆరు నెలల నుంచి ఇప్పుడు, అప్పుడు అని రుణమాఫీ కోసం ఎదురుచూసినాం తీరా గత నెల నుంచి రుణమాఫీ ప్రకటన టీవీలో చూసి నేను, నా భార్య తీసుకున్న క్రాఫ్‌లోన్ రూ. లక్షా డెబ్బై వేలు, లక్షా అరవై వేలల్లో ఏదో ఒకటి మూడు విడుతల్లో మాఫీ అవుతుందని అనుకున్నాం. కానీ రూ.రెండు లక్షల రుణమాఫీ లిస్టులో మా పేరు రాలేదని వ్యవసాయశాఖ, బ్యాంకు అధికారులను ఆరా తీయగా భార్యాభర్తలకు ఒకటే రేషన్‌కార్డు ఉండడంతో లిస్టులో పేరు రాలేదని చెబుతున్నారు. బతుకుదేరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లిన తాము రుణమాఫీ కోసం పండుగ, పబ్బం లేకుండా తిరిగే పరిస్థితి ఏర్పడింది. రుణమాఫీ కోసం భార్యాభర్తలు వేరుగా ఉండాలని ప్రభుత్వం చెబుతుందో ఏమో.. అంతా గందరగోళంగా ఉన్నది.

– కురుమ మల్లేశ్, రైతు, పాంరెడ్డిపల్లి, అమరచింత మండలం, వనపర్తి జిల్లా

# సమస్యలపై కన్నెర్ర

- సమస్యల తిష్టగా గురుకులం తయారైదంటూ విద్యార్థుల ఆగ్రహం
- పది రోజులుగా తాగునీటి గోస పడుతున్నా పట్టడం లేదని నిరసన


గురుకులం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 19 : మహబూబ్‌నగర్ పిల్లలమర్రి సమీపంలోని సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల (మహిళ)లో విద్యార్థినులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్య బయటకు పొక్కకుండా సంబంధిత అధికారులు కట్టడి చేశారు. రాఖీ పండుగ నేపథ్యంలో తల్లిదండ్రులు వారి బిడ్డలను చూసి అన్నలు, తమ్ముళ్లకు రాఖీలు కట్టించేందుకు రాగా గురుకులం అధికారులు లోపలికి అనుమతించలేదు. తల్లిదండ్రులు బయట ఉండగా విద్యార్థినులు గేటు లోపల కన్నీళ్లు పెట్టుకోవడంతో వారిని వాకబు చేయగా విషయం వెలుగు చూసింది. వారం, పది రోజులుగా తాము తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పడంతో విషయం వెలుగు చూసింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వెంటనే విద్యార్థినుల సమస్యలపై పరిష్కారంపై ఆందోళనకు దిగారు.

### అద్దె భవనం.. సమస్యలే సమస్తం

గురుకుల విద్యాలయం నిర్వహిస్తున్న భవనానికి నెలకు అద్దె సరాసరి రూ.6లక్షలకు పైనే చెల్లిస్తున్నా.. అందులో అన్నీ సమస్యలే ఉన్నాయి. తాగునీటికి నిత్యం తండ్లాటే.. మౌలిక సదుపాయాలు, మూత్రశాలలకు రన్నింగ్ వాటర్ సమస్యతో బకెట్లతో విద్యార్థినులు నీళ్లు తీసుకెళ్లాల్సిన దుస్థితి ఆ గురుకులంలో ఉన్నది. బోరు మోటరు మరమ్మతులు గురవుతున్నా భవన యజమాని మరమ్మతులు, కొత్త బోరు మోటరు విషయంపై ఏ మాత్రం స్పందించడం లేదని సిబ్బంది తెలిపారు. గురుకులంలో విద్యార్థినుల దాహార్తి తీర్చాలంటే నిత్యం తాగునీటిని ఫిల్టర్ వాటర్ కొనుగోలు చేస్తున్నారు. మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది. వాడుకునేందుకు నీటిని సైతం మున్సిపల్ అధికారులను రిక్వెస్ట్ చేస్తే పంపిస్తున్నట్లు సిబ్బంది అంటున్నారు.

### సమస్యల పరిష్కారానికి కృషి

గురుకుల విద్యాలయంలో బోరు మోటరు పాడవడంతో నీటి సమస్య ఎదురైంది. ఈ విషయంపై ఇప్పటికే సంబంధిత భవన యజమానికి తెలిపాం. మున్సిపల్ అధికారుల ద్వారా నీటిని తెప్పించుకుంటున్నాం. రన్నింగ్ వాటర్ లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. జిల్లా అధికారుల సహకారంతో సాధ్యమైనంత వేగవంతంగా సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం.

– డాక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్, సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల, మహబూబ్‌నగర్



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్మన్

### పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

గురుకులంలో విద్యార్థినులు ఆందోళనకు దిగారనే సమాచారంతో మహబూబ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ గురుకుల విద్యాలయాన్ని పరిశీలించారు. బోరు మోటరు, నీటి సమస్య, విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

# కార్యకర్తలకు బీఆర్‌ఎస్ అండ

- మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర్‌రెడ్డి
- కనిమెట్టలో బీఆర్‌ఎస్ ఇన్సూరెన్స్ చెక్కు అందజేత


మృతుడి కుటుంబానికి పార్టీ చెక్కును అందజేస్తున్న ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కొత్తకోట, ఆగస్టు 19 : బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కనిమెట్ట గ్రామానికి చెందిన వెంకటేశ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా పార్టీ తరఫున మంజూరైన రూ.2లక్షల ఇన్సూరెన్స్ చెక్కును ఆయన నేరుగా ఇంటికెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆల మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటుందని, ఏ పార్టీలో లేని విధానం మన పార్టీలో ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, మాజీ ఎంపీపీ గుంతమౌనిక, బీఆర్‌ఎస్ నేతలు ప్రశాంత్, విశ్వేశ్వర్, తిరుపతయ్య, రాములుయాదవ్, పరమేశ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# రైతులను దగాచేసిన సీఎం రేవంత్

- బీఆర్‌ఎస్వీ జిల్లా నాయకుడు కురుమ పల్లయ్య
- అయిజ రైతు వేదిక వద్ద రైతులతో కలిసి నిరసన

అయిజ, ఆగస్టు 19 : ఆరుగాలం వ్యవసాయం చేస్తున్న రైతులకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులందరికీ రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని చెప్పి రైతులను దగా చేశారని బీఆర్‌ఎస్వీ జిల్లా నాయకులు కురుమ పల్లయ్య అన్నారు. రైతులను బ్యాంకులు, వ్యవసాయశాఖ కార్యాలయాల చుట్టూ తిప్పుతూ రైతు నోట్లో మట్టి కొట్టారని ఆరోపించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా రైతులకు మొత్తం రుణాలు మాఫీ చేస్తామని దేవుళ్లపై ఒట్టు వేసి ప్రస్తుతం 40శాతం మంది రైతులకు రుణమాఫీ చేసి రైతులను నిండా ముంచారన్నారు. సోమవారం పట్టణంలోని మార్కెట్ యార్డులోని రైతు వేదిక వద్ద రుణమాఫీ కాని రైతులతో కలిసి నిరసన తెలిపారు. 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేందన్నారు. 31వేల కోట్ల రుణమాఫీ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి 17వేల కోట్లు రుణమాఫీ చేసి, ఎంతో మంది రైతులకు మాఫీ చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. మాజీ మంత్రి హరీశ్‌రావును విమర్శించే స్థాయి రేవంత్‌రెడ్డికి లేదన్నారు. ఆగస్టు 15లోగా ఆరు గ్యారెంటీలను అమలు చేయడంతోపాటు ప్రభుత్వం ప్రకటించిన విధంగా రుణమాఫీ చేయలేక సీఎం రేవంత్‌రెడ్డి హరీశ్‌రావును రాజీనామా చేయాలని కోరడం విడ్డూరంగా ఉందన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని ఏ గ్రామంలో కూడా వందశాతం రుణమాఫీ కాలేదన్నారు. ఏదో ఒక వంకతో రుణమాఫీ చేయకుండా రైతులను అధికారులు, బ్యాంకుల చుట్టూ తిప్పుతూ కాలయాపన చేస్తున్నారన్నారు. అన్ని అర్హతలు ఉన్న రైతులకు రుణమాఫీ కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తమవుతుందని, త్వరలోనే చమరగీతం పాడుతారన్నారు. రైతులకు షరతులు లేకుండా వందశాతం రుణమాఫీ చేసి తీరాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు నర్సింహులు, దుబ్బన్న, ఎల్లయ్య, జితేందర్‌రెడ్డి, వెంకటేష్, శ్రీనివాసులు, తిమ్మారెడ్డి, సత్యన్న, మత్తలి తదితరులు పాల్గొన్నారు.


అయిజలోని రైతువేదిక వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్వీ నాయకులు, రైతులు

# ఘనంగా రక్షాబంధన్


మక్తల్‌లో.. రాఖీ వేడుకల్లో చిన్నారులు


మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు రాఖీ కడుతున్న సోదరి శ్రీదేవి

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రజలు రక్షాబంధన్ ఘనంగా జరుపుకొన్నారు. తోబుట్టువులకు సోదరీమణులు రాఖీలు కట్టారు. ఆత్మీయ బంధానికి ప్రతీకగా నిర్వహించే పండుగను సంతోషాల మధ్య నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి ఆడపడుచులు తరలిరావడంతో రహదారులు, బస్సులు, ప్రయాణ ప్రాంగణాలు కిటకిటలాడాయి. పలు చోట్ల చెట్లకు సైతం రాఖీలు కట్టారు. రాఖీల విక్రయ కేంద్రాలు, మిఠాయి దుకాణాలు సందడిగా కనిపించాయి.

## జడ్చర్లలో వృక్షాలకు..


బొటానికల్ గార్డెన్‌లో వృక్షాలకు రాఖీలు కడుతున్న మహిళలు

జడ్చర్ల, ఆగస్టు 19 : స్థానిక డిగ్రీ కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌లో రక్షాబంధన్ సందర్భంగా సోమవారం వృక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాల బొటానికల్ గార్డెన్‌లోని వృక్షాలకు రాఖీలు కట్టారు. తోబుట్టువులు ఒకరికొకరు రక్షణగా ఉండాలని రక్షాబంధన్ జరుపుకొంటామని, పర్యావరణం సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో వృక్షాబంధన్ నిర్వహించినట్లు మహిళలు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు పర్యావరణపై చైతన్యం కలుగజేస్తాయని వెల్లడించారు.



హైదరాబాద్‌లో మంత్రి పొంగులేటి నుంచి అవార్డు అందుకుంటున్న ఫొటో గ్రాఫర్ గోపి

## 'నమస్తే' ఫొటో గ్రాఫర్‌కు హ్యాట్రిక్ అవార్డులు

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేతులు మీదుగా అందుకున్న గోపి

మహబూబ్‌నగర్, ఆగస్టు 19 : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలో ఉత్తమ ఫొటో గ్రాఫర్‌గా మహబూబ్‌నగర్ 'నమస్తే తెలంగాణ' స్టాఫ్ ఫొటో జర్నలిస్టు బందిగె గోపి రెవెన్యూ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేతులు మీదుగా అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని గ్రీన్ పార్కులో ప్రపంచ వరల్డ్ ఫొటోగ్రఫీ సందర్భంగా ఉత్తమ ఫొటోలు తీసిన వారికి బహుమతులు అందజేశారు. బందిగె గోపి ఈ 2024లో ప్రపంచ ఫొటోగ్రఫీ సందర్భంగా మూడు అవార్డులు అందుకున్నాడు. ఏపీలోని ఐఅండ్‌పీఆర్, ప్రెస్ ఆకాడమీ వారు నిర్వహించిన ఈవెంట్‌లలో మూడు బహుమతులు సాధించగా 'నమస్తే తెలంగాణ' యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.